నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్, ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫాతిమానగర్, ఫారూఖ్‌నగర్ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. ఫాతిమానగర్, ఫారూఖ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే ఈద్గా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. ప్రిన్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



సుల్తాన్‌బజార్: శ్రావణ సోమవారం సందర్భంగా బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..శ్రావణ సోమవారం సందర్భంగా సమాజ హితం కోసం మహా రుద్రాభిషేకం నిర్వహించామన్నారు. బజరంగ్‌సేనా హిందూ ధర్మ రక్షణ కోస మే కాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడు తుందన్నారు. ఇందులో భాగంగానే రుద్రాభిషేకం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో తమ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులను సంతోష్‌నగర్ పోలీసులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్లను అందజేశారు. సంతోష్‌నగర్ డివిజన్ ఠాకూర్ సుఖ్‌దేవ్ సింగ్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జగన్ రెడ్డి, ఎస్సైలు రవి, మణికొంత పోగొట్టుకున్న బాధితులకు తమ సెల్‌ఫోన్లను అందజేయడంతో ఆనందం వ్యక్తం చేసి పోలీసులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో నాగ పద్మావతి సత్తా



గన్‌ఫౌండ్రీ: గ్రేటర్ హైదరాబాద్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఎల్బీస్టేడియంలో నిర్వహిస్తున్న పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో నగరానికి చెందిన నాగ పద్మావతి రెండు బంగారు పతకాలను గెలుపొందారు. ఈ సందర్భంగా నాగ పద్మావతి మాట్లాడుతూ..ప్రతి మహిళా శారీరకంగా, బలంగా, మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.


మురుగు సమస్యను పరిష్కరించాలి



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో వినాయక ఉత్సవాలకు ముందే మురుగు సమస్యలను పరిష్కరించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం కలిసి మొఘల్‌పురా జలమండలి మేనేజర్ రఘువీర్‌ను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గౌలిపురా డివిజన్ కన్వీనర్ సాకేత్, కమిటీ సభ్యులు కార్తీక్, సంజయ్, వినయ్, మండపాల నిర్వాహకులు గౌరవ్, రాహుల్ కలిసి వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫాంది అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని యాకుత్‌పురా, షేక్ ఫయాజ్ కమన్, గంగానగర్ నాలా, మాతాకి కిడికి, డబీర్‌పురా తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముంపు సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు అలందార్ వాలాజాహి, వసీవుద్దీన్, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ

పండుగకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- పాతబస్తీలో అధ్వానంగా రోడ్లు, మ్యాన్‌హోళ్లు
- మరమ్మతు పనులు చేపట్టాలంటున్న ఉత్సవాల నిర్వాహకులు
- సమన్వయంతో సమస్యలు పరిష్కరిస్తే భక్తులకు సౌకర్యం



గౌలిపురాలో పారుతున్న డ్రైనేజీ మురుగు



అయోధ్యానగర్‌లో అధ్వానంగా రోడ్డు

చార్మినార్: వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు ఉత్సవాల నిర్వాహకులు కోరుతున్నారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే మండపాల వద్ద ముందుగానే అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలంటున్నారు. చాలా ప్రాంతాల్లో రోడ్లు శిథిలావస్థకు చేరుకోవడం.. డ్రైనేజీలు పొంగి రోడ్లపై ప్రవహించడం తదితర సమస్యలున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన మండపాల పరిసరాల్లో సాధ్యమైనంత వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికే జలమండలి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ విభాగాల అధికారులకు ఆయా సమస్యలను తెలియజేస్తున్నామని..సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీ, రోడ్లు..

పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపం పరిసరాల్లో జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాలకు చెందిన అధికారులు వెంటనే అభివృద్ధి పనులు నిర్వహించాలని స్థానిక ఉత్సవాల నిర్వాహకులు కోరుతున్నారు. డ్రైనేజీ మురుగునీరు పొంగి రోడ్డును ముంచెత్తుతోందంటున్నారు. శిథిలావస్థకు చేరిన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వెంటనే అభివృద్ధి పనులు నిర్వహించాలి..

వినాయక ఉత్సవాలు ఈ నెల 27న ప్రారంభమై వచ్చే నెల 6వ తేదీన నిర్వహించే నిమజ్జనోత్సవాలతో ముగుస్తున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని వెంటనే అభివృద్ధి పనులు నిర్వహించాలి. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు వెంటనే కార్యాచరణ ప్రారంభించాలి. ఉత్సవాలకు ముందుగానే పనులను పూర్తి చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

– రాకేష్ తివారి, సుల్తాన్‌షాహీ

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ జాయింట్ కమిషనర్ డి. శంకర్‌సింగ్ అన్నారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిని నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట సర్కిళ్ల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై మొత్తం 3 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ మాట్లాడుతూ..స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగు నీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ సతీష్‌రెడ్డి, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ భానుచందర్, సుధాకర్, శ్రీధర్ బిల్ కలెక్టర్ రాజేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందహెచ్చు కళారూపాలను కాపాడుకోవాలి



మామిడి హరికృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న మంద హెచ్చు కళాకారులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న మందహెచ్చు కళారూపాలను కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర మంద హెచ్చు కళాకారుల సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మంద హెచ్చులు తెలంగాణలో ఒక ఆశ్రిత కులమని, యాదవ కులాల వారికి చెందినవారని తెలిపారు. కళారూపంలో బొమ్మలను ప్రదర్శిస్తూ కథను వివరించడం వారి ప్రత్యేక ఆకర్షణ అని కొనియాడారు. కాల క్రమంలో మంద హెచ్చు కళాకారుల సంఖ్య తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ..మందహెచ్చు కళాకారులకు పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందహెచ్చు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మల పెద్దిరాజు, గౌరవ అధ్యక్షులు బొమ్మల దేవయ్య, కె.వీరమల్లు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి ప్రజలే గుణపాఠం చెబుతారు'



గోషామహల్‌లో ఘర్ ఘర్ తిరంగాలో పాల్గొన్న ఆల పురుషోత్తమ్ రావు

అఫ్జల్‌గంజ్: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తమ్ రావు పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మోదీ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ జాతీయ జెండాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా దగా చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా కృష్ణాగుప్తా, మీనాక్షి సిక్వాల్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో జోరుగా ఏర్పాట్లు



గోల్కొండ: గోల్కొండలో జరగనున్న పంద్రాగస్టు వేడుకల కోసం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రతి యేటా పంద్రాగస్టు రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి గోల్కొండ కోటలో పతాకావిష్కరణ చేస్తారు. ఈ ఏర్పాట్లల్లో భాగంగా సోమవారం కోటలోని రాణి మహల్ ఎదురుగా ఉన్నా ప్రాంగణంలో వేదికల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పంద్రాగస్టు రోజు వరకు వర్షం కురిసే ప్రమాదం ఉండడంతో అధికారులు దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సారి క్లాతింగ్ టెంట్లకు బదులు షెడ్లు వేస్తున్నారు. మరోవైపు సెక్యూరిటీ అధికారులు సైతం కోటలో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. వేదికలు, టెంట్లు వేస్తున్న ప్రాంతంలో పర్యాటకులను అనుమతించడం లేదు.

మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



జలమండలి డీజీఎం శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: పలు హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్లపై, మూతలు లేని మ్యాన్‌హోళ్లలో వేస్తున్నారని ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ లక్ష్మీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం గుడిమల్కాపూర్‌లోని జలమండలి డీజీఎంకు వినతిపత్రం సమర్పించారు. తమ కాలనీని ఆనుకొని ఉన్న రెడ్‌సీ హోటల్ యజమాని యథేచ్ఛగా వ్యర్థాలను రోడ్లపై వదులుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో మ్యాన్‌హోళ్లు పూర్తిగా మూసుకుపోయాయని మురుగు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. పలుమార్లు ఈ విషయంపై హోటల్ యజమానితో మాట్లాడినా మార్పు రాలేదన్నారు. వెంటనే మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా సంబంధిత సెక్షన్ అధికారులతో ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని డీజీఎం శ్రీనునాయక్ హామీ ఇచ్చారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి

గోల్కొండ: నెక్లెస్ రోడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు జరగనున్న తిరంగ ర్యాలీలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కార్వాన్‌కు చెందిన బీజేపీ నాయకుడు జొన్నకుంటి మధుసూదన్ పిలుపునిచ్చారు. మన జాతీయ పతాకం మన దేశభక్తికి చిహ్నం అని దేశం పట్ల తమ ప్రేమను చాటుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈ తిరంగా ర్యాలీలో పాల్గొనాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

లక్డీకాపూల్: లిఫ్ట్‌ల్లోకి నీరు చేరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అహ్మద్ గూడ డబుల్ బెడ్ రూం ఇళ్ల నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నివాసితులు బైఠాయించారు. తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానా ఏర్పాటుతో పాటు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ముఖ్యంగా అహ్మద్‌గూడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి లిఫ్టులు రిపేర్లు చేయించడమే కాకుండా తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ మేరకు ప్ల కార్డుల ప్రదర్శన నిర్వహించారు. మురుగునీటి సమస్య, దోమల బెడదతో కనీసం రాత్రులు నిద్ర కూడా పోవడం లేదని డబుల్ బెడ్ రూం ఇళ్ల నివాసితులు ఆవేదన చెందారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న రవీందర్‌రావు

జియాగూడ: గత కొన్ని ఏళ్లుగా లయన్స్ క్లబ్‌కు ఆకుల రవీందర్‌రావు చేస్తున్న సేవలను గుర్తించి నూతనంగా రాయల్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినట్లు పీడీజీ లయన్ కమల్ కిషోర్ అగర్వాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం లయన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ..మరిన్ని సేవలందించేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో గోపిశెట్టి ప్రమోద్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం



అబిడ్స్: చెన్నకేశవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ వద్ద అన్నదానం చేశారు. సోమవారం ట్రస్ట్ నిర్వాహకులు కాజా వెంకట వసంత, సుజాత, ప్రకాష్, స్నేహ, పద్మావతి, అన్నపూర్ణ, భాను, నిషా తదితరుల ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కాజా కాజా వెంకట వసంత మాట్లాడుతూ..ప్రతి నెలా నిరంతరం మార్కెట్‌కు వచ్చిపోయే వారి కోసం ఈ అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన హైదరాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీహెచ్ఈఎల్–రామచంద్రాపురం రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వృద్ధుడు(60) రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలం రంగు, ఆరంజ్ రంగు కలిగిన టీ షర్టు, బూడిద రంగు షార్ట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పులిపాటి రాజేష్ కుమార్ తదితరులు

చార్మినార్: మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి నూతనంగా ఏర్పడిన పాలక మండలి కృషి చేయాలని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ కోరారు. నియోజకవర్గంలోని రామా టాకీస్‌కు ఆనుకొని ఉన్న మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం పాలక మండలి కమిటీ నియమించబడింది. చైర్మన్‌గా మాచెర్ల నరేందర్, సభ్యులుగా సింగం దేవేందర్‌యాదవ్, ఎస్. కృష్ణ, సోమిడి హరి బాబు, కంపే దేవేందర్, సుధారాణి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పాలక మండలి ప్రమాణ స్వీకారానికి పులిపాటి రాజేశ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మండలి సభ్యులుగా నియమితులైన వారు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన పాలక మండలి సభ్యులతో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ సురేందర్, దేవస్థానం ఈఓ మహిందర్ రెడ్డి ప్రమాణం చేయించారు.

వినాయక మండప పరిసరాల్లో సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నరేందర్ రెడ్డి, శ్రీకాంత్

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ విఘ్నేశ్వర సాయి ధామం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆపరేషన్ సింధూర్ థీమ్ గణపతి మండప పరిసరాల్లో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ ప్రధాన కార్యదర్శి పగిళ్ల నరేందర్ రెడ్డి, కోశాధికారి గుండు శ్రీకాత్ కోరారు. ఈ మేరకు సోమవారం జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది 49వ వార్షికోత్సవం సందర్భంగా ఆపరేషన్ సింధూర్ థీమ్‌తో రెండు ఎస్–400 ఆర్మీ వెహికిల్స్, ఆపరేషన్ మిస్సైల్స్ నమూనాలను తయారు చేస్తున్నామన్నారు. ఈ నెల 15న సాయంత్రం గణపతి ఆగమన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. వర్షాకాలం దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్వాన్, లంగర్‌హౌస్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తమతమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. లో ప్రెషర్‌తో నీరు రావడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలుమార్లు సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గంలో నీటి సరఫరాకు ఎటువంటి డోఖాలేదన్నారు. లోప్రెషర్ ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరా వేళలను పెంచడంతో పాటు ఆయా ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

శిథిల భవనాల కూల్చివేతలకు సహకరించాలి



హుస్సేనీ ఆలంలో కూలిన పురాతన భవనం



పురాతన భవనాల కూల్చివేతలను పరిశీలిస్తున్న డీసీ సరిత

చార్మినార్/దూద్‌బౌలి: వర్షాకాలం నేపథ్యంలో పురాతన భవనాలను ప్రమాదాలు జరగకముందే కూల్చివేతలకు ఇంటి యజమానులు సహకరించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరిత అన్నారు. భారీ వర్షానికి హుస్సేనీ ఆలం ప్రాంతంలో పురాతన భవనం శనివారం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో అక్కడి ప్రజలు పరుగులు తీశారు. ఈ ఇంటిని కూల్చి చేయాల్సిందిగా అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఇంటి యజమాని పట్టించుకోకపోవడంతో శనివారం కుప్పకూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఇలాంటి పురాతన భవనాలు స్థానికులను గురిచేస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరిత సిబ్బందితో కలిసి హుస్సేని ఆలం ప్రాంతంలోని మూడు భవనాలను షక్కర కోటలోని ఓ చిన్న భవనాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రమాదాలు పొంచి ఉన్న భవనాలను గుర్తించి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, కొన్ని కోర్టు కేసుల వల్ల కూల్చి వేయలేదని..అత్యంత పురాతనమైన భవనాలను కూల్చివేసేందుకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కూల్చివేతల కార్యక్రమాన్ని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ సందర్శించారు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రిదిమా సింగ్ హజారికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రెటరి ప్రదీప్‌చంద్ర పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయా గోల్కొండ–1లో ధూల్‌పేటకు చెందిన రిదిమా సింగ్ హజరి 92.8 శాతం మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆమెకు కేవీఆర్ శ్రీనివాస్ మూర్తి మెమోరియల్ అవార్డు అందజేశారు. ఈ అవార్డు కింద రూ.2.20 లక్షల నగదును ఆమెకు అందజేసి ప్రదీప్‌చంద్ర అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కష్టించి విద్యారంగంలో ఉత్తమ విద్యార్థులుగా ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఏ కె.రాజ్యలక్ష్మి, దుర్గేష్ సింగ్ హజారి, సుధీర్‌కుమార్ తివారి పాల్గొన్నారు.

మురుగుమయం.. బురద భయం

- ఇటీవల కురిసిన వర్షాలకు పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



శాంతినికేతన్ స్కూల్ ముందు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



అయోధ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు..



హనుమాన్‌నగర్ ఫేజ్–2లో..

గౌలిపురా: ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు పొంగి రహదారులపై మురుగు ఏరులై పారుతోంది. దీంతో పాటు పలు ప్రాంతాల్లో బురద నిలవడంతో అందులో నుంచి రాకపోకలు సాగించేక్రమంలో జారి కిందపడిపోతున్నామని వాహనదారులు భయపడుతున్నారు. అయోధ్యనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో, శ్రీరాంనగర్ కాలనీలోని శాంతినికేతన్ స్కూల్ సమీపంలో డ్రైనేజీ మురుగు పొంగిపొర్లుతుండటంతో పాటు పాములు కూడా బయటకు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి తోడు స్కూల్‌కు రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటి కారణంగా పిల్లలు ఎలాంటి వ్యాధుల బారిన పడుతారోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్‌నగర్ ఫేజ్–2 ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షానికి ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మట్టిదిబ్బలతో బురద పేరుకుపోయింది. ఈ బురదల్లో దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రజలు అనారోగ్యానికి గురి కాకముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.